# 'సా విద్యా యా విముక్తయే'

**మాట చెప్పినట్టు మనుజుండు నడచిన**
**మాట యిచ్చినట్టు మనుజుండు నడచిన**
**మనిషి కాదు వాడు మహితుడగును**
**మాట చెప్పినట్టు మనిషి నడువదేని**
**మనిషి కాదు వాడు మృగమెకాని**

ప్రేమస్వరూపులారా!

మానవునియొక్క పవిత్రత, మానవునియొక్క కీర్తి, మర్యాదలు, మానవునియొక్క ఉన్నతస్థితి మాటపై ఆధారపడివున్నవి. మాటయే మానవునకు ప్రాణము. మాటను తప్పినా ప్రాణమును పోగొట్టుకున్నట్టే! ఈ మానవునియొక్క మాటలకు ఖర్చులేదుగాని, విలువ ఎక్కువ. ఇలాంటి విలువైన మాటను మానవుడు నిలుపుకున్నప్పుడే మానవత్వాన్ని సార్థకము గావించుకున్నవాడౌతాడు. తన మాటను తాను పోషించుకునే నిమిత్తమై జీవితమునే త్యాగము చేసి దివ్యత్వమును అనుభవించి పవిత్రమును ప్రచారము గావించినవాడే తులసీదాసు.

**మాట నిలుపుకున్నవాడే మానవత్వమును సార్థకము గావించుకున్నవాడు**

ఇతను ఆత్మారామ్ దుబె, తులసి అనే దంపతులకు జన్మించాడు. ఇతను 1554 విక్రమశకములో పుట్టాడు. క్రీస్తుశకము 1493 సంవత్సరము శ్రావణమాసము శుక్ల సప్తమిరోజు జన్మించాడు. సాధారణముగా బిడ్డలు పుట్టిన తక్షణమే ఏడ్వటం ప్రారంభిస్తారు. కారణమేమనగా, దీనికి రెండు విధములైన అర్థములున్నవి. ఆధ్యాత్మికముగా

**తల్లిగర్భమునుండి జన్మించినంతనే కెవ్వుకెవ్వు ఏడ్చెదరు నవ్వకుండ**
**ఏడ్పుటేలకో తెలిసినది మీకు దినదినంబును గడిచెడి తెరగుచూడ**

sri sathyasai vachanamrutam

మనజీవితములో భవిష్యత్తుగురించి, జీవితముయొక్క బాధ్యతలనుగురించి, జీవితముయొక్క కర్తవ్యమును నిర్వర్తించుకునే క్రియనుగురించి తెలుసుకోవాలి. మానవుడు పుట్టినప్పుడు పరిశుద్ధుడై వుండటంచేత అతనికివన్నియు కూడను అద్దములో కనిపించినట్టుగా వుంటుంటాయి. జీవితమనేది కేవలము ఆటపాటలతో ఆనందముగా గడపటం కానేరదు. అనేక సమస్యలతో కూడినది జీవితము. కష్టములు, నష్టములు, లాభములు, నిందలు, నిష్ఠూరములు యిలాంటి పుష్పములచేత కట్టబడిన హారమే మానవ జీవితము. కనుక, జీవితమనేది సామాన్యమైనది కాదని, భవిష్యత్తునందు అనేక బాధలకు గురికావలసి వస్తుందని తాను గుర్తించి యీ పుట్టిన బిడ్డ అప్పటికప్పుడే రాబోయే బాధలను చూసి యేదుస్తాడు.

ఇంక లౌకికమైన జీవితములో దీని అర్థము వేరుగా వుంటుంది. తల్లి గర్భమున వున్నప్పుడు బిడ్డ తన శ్వాస, తన ఆహారము తల్లిద్వారానే అందుకుంటాడు. పుట్టిన తక్షణమే తల్లి ప్రేగునకు తనకు సంబంధమును విడదీస్తారు, ప్రకృతి జనులు. కనుక, తన ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఆడటంకూడను కొంచెం కష్టతరమవుతుంది. ఈ రెండు లేనప్పుడు రక్తముయొక్క సరఫరా సరైన రీతిగా వుండదు. కనుక, బిడ్డ ఏడ్చినప్పుడు ఆ ఏడుపులో, ఆ శ్వాసవల్ల యీ నవరంధ్రములుకూడను తెరుచుకుంటాయి. తన ముఖము, నోరుయందుకూడను అనేక విధములైన జలము నిండివుంటాది. ఈ ఏడ్పువల్ల తనయొక్క ఉచ్ఛ్వాసనిశ్వాసములు సక్రమముగా జరుగుతాయి. అప్పుడు blood circulation కూడా సక్రమముగా జరుగుతుంది. ఈ విధముగా బిడ్డ ఏడ్చేనిమిత్తమై పుట్టిన తక్షణమే యేడ్వని పిల్లలను నర్సులు కాళ్లు చేతిలో పట్టుకొని తలక్రిందులుగా నిలిపి తట్టుతారు. తద్వారా సహజమైన ఉచ్ఛ్వాసనిశ్వాసములు ప్రారంభమవుతాయి. కాని, యీ తులసిదాసునకు పుట్టిన తక్షణమే ఏడ్పు రాలేదు.

**తులసికి సేవ చేస్తూవచ్చాడు కనుక 'తులసీదాసు' అని పేరు పెట్టారు**

ఇతని స్వరూపము చూచినప్పుడు యేదో సమాధినిష్ఠలో వుండినట్టుగా గుర్తించారు, చుట్టూ వుండిన స్త్రీలు. ఈ విధమైన పుట్టుకరావటం చేత చుట్టుప్రక్కల ప్రజలు, కొంతమంది

srisathyasaivachanamrutam

స్త్రీలు గుసగుసలు ప్రారంభించారు. ఈ బిడ్డ పుట్టిన నక్షత్రము మంచిదికాదని, జన్మము సరైనదికాదని అనేక విధములుగాకూడను మాట్లాడుతూ వచ్చారు. దానికి తగినట్లుగానే కొన్ని లౌకికమైన అశుభములు ప్రారంభమైనాయి. నాల్గవదినమే తల్లికి తీవ్రమైన జ్వరము వచ్చింది. సప్తమిరోజు తులసిదాసు జన్మించాడు. ఏకాదశిరోజు అనగా నాల్గవదినమే తల్లి తులసి మరణించింది. తల్లి మరణించిన తక్షణమే అందరూ అనుకుంటున్నట్లుగా యి పిల్లవాడు కొన్ని అశుభలక్షణములతో జన్మించాడని, తల్లి మరణమునకు కారకుడైనాడని తండ్రి మనసుకు కొంత కష్టం కలిగింది. ఇంక ఆచంటి బిడ్డను చూచుకొనే దిక్కు ఆ యింటిలో ఎవ్వరూలేరు. ప్రక్కింటిలో బిడ్డలు లేని ఒక అమ్మ వుంటుండినాది. ఆమె పేరు ఛులియా. యీ బిడ్డను చూచి 'అయ్యా నేను పెంచుకుంటూనని' ఆమె అడుక్కుంది పాపం. తండ్రి పురిటిబిడ్డను ఆనందముగా ఆమెకు అందించాడు. ఆ ఛులియా యి బిడ్డను యెంతో గారాబముగా సాకింది, పాపం. అయితే ఈమెకూడను బిడ్డకు పదవసంవత్సరము వచ్చేటప్పటికి మరణించింది. ఇంక ఏ ఆధారము లేకపోవటముచేత చుట్టుప్రక్కలవారు యీ బిడ్డను యెవరైనా సాకటానికి అవకాశము వుంటుందా అని విచారించగా ప్రక్కగ్రామములోపల 'రామశీల ఆశ్రమము' అని ఒక అనాధాశ్రమము వున్నదని తెలిసింది. ఆ ఆశ్రమములోపల దానికి యజమానుడుగా నరహరిదాస్ అనే వ్యక్తి వుండేవాడు. నరహరిదాస్ యీ పిల్లవానిని తీసుకొని వచ్చి పెంచుకుంటూ తన ఆశ్రమములో అనేక పనులు చెప్పుతూ విద్యలు గరిపిస్తూవచ్చాడు. ఆ ఆశ్రమములోపల ఒక తులసివనము వుండేది. ఇతను చదువుకున్నంతసేపు చదువుకోవటము, తరువాత తులసివనమునకు నీరుపోయటము, ఎండిన కొమ్మలు విరచివేయటము యీ విధమైన సేవలు చేస్తూవచ్చేవాడు. ఆశ్రమానికి చేరినతక్షణమే యీ బిడ్డకు నరహరిదాసు 'రాంభోలా' అని కొత్తగా పేరు పెట్టాడు. అయితే ఈ పేరు నరహరిదాసుకు, యింకా కొద్దిమంది సన్నిహితులకు తప్ప మిగతావారెవ్వరికి తెలియదు. యితనికి కాలము చిక్కినప్పుడంతాకూడను తులసివనములోనికి పోయి సేవలు చేస్తూవుండేవాడు. సాధారణంగా జనులు యేపని చేస్తూవుంటారో ఆ పేరునుపెట్టి పిలచటం కొంతవరకు లోకముయొక్క వాడుక. ఆనాటినుండి ఆశ్రమానికి వచ్చేవారు, ఆశ్రమములో

sri sathyasai vachanamrutam

స్థిరనివాసులైనవారు, అందరూకూడా యితనిని 'తులసిదాస్! తులసిదాస్' అని పిలుస్తూవచ్చారు. తులసికి సేవ చేస్తున్నాడు కనుక యితని పేరు 'తులసిదాస్' అన్నారు. ఈ విధంగా పెరుగుతూ వచ్చాడు.

**సహజంగా అబ్బిన విద్య మధురంగా ఉంటుంది**

క్రమక్రమేణా రాములపైన పాటలు వ్రాయటం, తాను పాడటము, యీ విధమైన చర్యలు దినదినాభివృద్ధిగాంచినాయి. పూవుపుట్టిన తక్షణమే వాసన వెదజల్లుతుంది. ఆ విధముగానే యీ తులసిదాసుయొక్క ప్రభావములు, భక్తిప్రవత్తులు దినదినాభివృద్ధిగాంచుతూ వచ్చాయి. అతనికి ఎవ్వరూ గురువులు లేకపోయినప్పటికిని, ఎవరి దగ్గరకూడను తాను అభ్యాసము చేయకపోయినప్పటికిని, పాటలు శ్రావ్యముగా పాడేవాడు. అతి మధురంగా వుండేవి. గురువుద్వారా వచ్చిన విద్యలు కృత్రిమంగా వుంటుంటాయి; సహజముగా వచ్చినటువంటివి మధురంగావుంటాయి. యీ మాధుర్యము తులసిదాసులో సహజంగానే వుద్భవించింది. తన గురువైన నరహరిదాసు చెప్పే రామాయణములోని విషయాలంతాకూడను చక్కగా, చిత్తశుద్ధితో వినేవాడు. విన్న విషయములను తనయొక్క పదములద్వారా, తనయొక్క భావముద్వారా, తనయొక్క మానసిక సంకల్పముచేతను చాలా పవిత్రమైన కావ్యంగా వ్రాస్తూవచ్చాడు. అప్పుడప్పుడు నరహరిదాసుకూడా ఇది చూసి తనలో తాను సంతసించేవాడు. కానీ, తులసిదాస్ దగ్గర మాత్రం మెచ్చుకొనేవాడు కాదు. క్రమక్రమేణా ఇతనియొక్క పేరు, ప్రతిష్ఠలు నలుదిశలా వ్యాపించాయి.

తులసీదాసుకు యిరువది, యిరువది ఒక్క సంవత్సరముల ప్రాయం వచ్చింది. అదే గ్రామములోపల ఉండే బ్రాహ్మణులు యీ పిల్లవానికి తమ బిడ్డనిచ్చి పెండ్లి చేయాలని ప్రయత్నంచేశారు. ప్రారంభములో తులసిదాసు తనకు వివాహము అక్కరలేదన్నాడు. ఇది సర్వసామాన్యముగా అలాంటి పిల్లలంతా చెప్పటము సహజము. ఏ తల్లిదండ్రులడిగినాకూడను, ఏ గురువులు అడిగినాకూడను 'అబ్బే! నాకు మేరేజ్ యిష్టం లేద'ని చెప్పటం ఒక ఫాషన్. ఇది ఆనాడే ప్రారంభమైంది. అయితే నరహరిదాసుయొక్క



srisathyasaivachanamrutam

ప్రోత్సాహ ప్రోద్బలములచేత కడపటికి వివాహము చేసుకోవటానికి అంగీకరించాడు. ఒక శుభముహూర్తములోపల ఆ బిడ్డనిచ్చి వివాహము జరిగింది. కాని, యిక్కడ కొన్ని సన్నివేశాలు చెప్పక తప్పదు. అవి చెప్పినప్పుడే భవిష్యతులో జరుగపోయే సంఘటనలు చక్కగా అర్థమవుతాయి పిల్లలకు.

పెండ్లి అయ్యేంతవరకు పెండ్లి యిష్టములేదని చెప్పిన తులసిదాసు పెండ్లి అయిన మరుక్షణమునుండి భార్యను ఒక్కక్షణమైనా విడిచిపెట్టి వుండేవాడుకాదు. ఆమె లేకుండా నీరైనా త్రాగేవాడుకాదు. అన్ని పనులుకూడను మానుకొనేవాడు. ఆమెను తిండి తినుటకుకూడ వదిలేవాడుకాదు. తాను తినుటకు పోయేవాడుకాదు. ఈ విధమైన హిస్టీరియా ప్రారంభమైంది. పెండ్లి అయినతరువాత, వీరింటికి వచ్చిన తరువాత ఒక సంవత్సరము గడచినప్పటికిని, వూరిలో వుండినప్పటికిని భార్యను పుట్టిన యింటికి పంపలేదు, పాపం. ఇక రామకథను పాడటంకాని, రామకథను వ్రాయటంగాని పూర్తిగా స్థంబించిపోయింది. అతని భార్యకు చాలా విసుగుపుట్టింది. ఏదో ఒక సమయము చూచుకొని ఒక్కదినమైనా తన పుట్టినింటికి పోవాలని ఆశించింది ఆమె, పాపం! ఒక రోజున తులసిదాసు తప్పనిసరిగా ఒకనాడు ప్రక్కగ్రామానికి పోయి రాత్రికి వస్తానని చెప్పేటప్పటికి ఆమె పుట్టింటికి పోయిరావడానికి యిదే సమయమని భావించింది. ప్రక్కింటివారితో చెప్పి తన సోదరునితో చేరి పుట్టినింటికి వెళ్లింది. ఆనాటి స్త్రీలు ఒంటరిగా బజార్లో తిరగటం యేమాత్రము అలవాటులేదు. కనుక, సోదరునితో కలసివెళ్లి తన పుట్టినింటికి చేరుకుంది. ఇంతలో రాత్రి కొంతభాగము గడచిపోయింది. ఆ సమయానికి తులసిదాసు తన యిల్లు చేరుకున్నాడు. కుండపోతగా వర్షము కురుస్తున్నాది. మించులు మించుతున్నాయి. భయంకరమైన ఉరుములు ఉరుముతున్నాయి. తులసిదాసు చాలా ఉత్సాహంగా, చాలా ఆనందంగా ఎప్పుడు ఎప్పుడు భార్యను చూడాలని ఆవేశముతో వున్నాడు. ఇంటికి వచ్చేటప్పటికి తాళము వేసివుంది. ప్రక్కింటామె చెప్పింది, “అయ్యా! ఆమె పుట్టినింటికి వెళ్లింద”ని. అప్పటికే రాత్రి పదిగంటలు గడిచిపోయింది. ఆకాలములో పల్లెలలో సాయంకాలం ఏడుగంటలకే భుజించి నిద్రించేవారు. పది పదకొండు గంటలంటే ఒక అర్థరాత్రివేళని వారు తలంచేవారు. ఈనాడు పది, పదకొండు, పన్నెండు

sri sathyasaivachanamrutam

గంటలంతాకూడను డిన్నరు టైమని భావిస్తున్నారు, ప్రజలు. ఈ వర్షమును, వురుములను, మెరుపులను లెక్కచేయకుండా నడచుకుంటూ తులసిదాసు అత్తవారింటికి వెళ్లాడు. ఆతృతతో తలుపును కొంచెం బిగ్గరగా కొట్టాడు. అతని భార్యకు తెలుసును, యీ పిచ్చిమనిషి ఎప్పుడైనా అక్కడకు రావచ్చుని. అమ్మను తలుపు దగ్గరకు పంపకుండా తానే వెళ్లి తలుపుతీసింది. చూసేటప్పటికి తులసిదాసు శరీరమంతా తడిసిముద్దయి నీరుకారిపోతుండాది. బయట కుంభవర్షము కురుస్తున్నాది. మించుమించినప్పుడు యితని ముఖము కనుపించింది. ఆమెకు తులసిదాసుపై పట్టలేని కోపము వుట్టిపడింది. తనకు నిద్రాభంగము కావటంచేతను, యితని చర్యలు సక్రమమైన మార్గములో లేవని తెలుసుకోటంచేతను ఆమెకు మరింత కోపం వచ్చింది. ఆమె నోరు విప్పి గట్టిగా "కామాంధుడా! యీ చిమ్మచీకటిలోపల యీ వర్షమునందు ఒక్కదినమైనా నీవు ఓపిక పట్టుకోలేకపోయావా? మల, మూత్ర, దుర్గంధ, మాంసరక్తములతో కూడిన యీ దేహముపై పెంచుకున్న మోహము అణుమాత్రమైనాకూడను ఆరాములపై వుండివుంటే నీవు ఎంత ధన్యుడవై వుండేవాడవో", అని చివాట్లు పెట్టింది. "ఇదేనా మానవునియొక్క విలువ. ఇదేనా గృహస్థ ధర్మముయొక్క చర్య", అని ఆమె పలికిన సూటైన మాటలు అతని హృదయానికి గ్రుచ్చుకున్నాయి. తులసిదాసు ఇంక అక్కడ నిలువలేదు. ఒక్క క్షణములో అతని మనసు మారిపోయింది. భార్యను తనకు గురువుగా భావించుకున్నాడు. తక్షణమే వెనుకకు తిరిగాడు. ఆ కాళరాత్రిలో, చిమ్మచీకటిలో, కుంభవర్షములో జీవితముమీద యేమాత్రము ఆశలేకుండా ప్రయాణము చేసి ప్రయాగ చేరుకున్నాడు.

అక్కడే ప్రయాగలో స్థిరపడి కాలము గడుపుతూవచ్చాడు. "నిజమే! నా జీవితమంతా మానవుడనని పిలిపించుకొని కుక్కలు, నక్కలవలే నేను జీవించటానికి పూనుకున్నాను. జీవితమనేది కేవలము యీ యొక్క సుఖముకోసమా వచ్చింది? కాదుకాదు! నా భార్య చెప్పిన వాక్యము మహా పవిత్రమైన వాక్యము. ఆమెయందే శ్రీరాములు ప్రవేశించి నాకీవిధమైన వుపదేశము చేయించాడ"ని తలంచాడు. నేను యే క్షణభంగురమైన సుఖముకొరకు ఆశించానో ఆ శారీరక సుఖమును నాకంటి యెదురుగానే అనేక జంతువులు, మృగములు, గాడిదలు, కుక్కలు, కోతులు, నక్కలు అన్నీకూడను



srisathyasaivachanamrutam

అనుభవిస్తున్నాయి. నేనుకూడను వాటితో సమానమా లేక నేను ప్రత్యేకమైన మానవత్వ విశిష్ఠతతో వుంటున్నానా" అని తనలో తాను విచారించుకుంటూ వచ్చాడు. ఆనాటినుండే తాను రామగానము ప్రారంభించాడు. కొన్ని ఆశ్రమాలవారితో స్నేహము గావించుకున్నాడు. "రామచరితమానస్" అనే పవిత్ర గ్రంథరచన ప్రారంభించాడు. అదే తులసీదాసు రామాయణము. దీనిని పద్య కావ్యరూపములో లిఖిస్తూవచ్చాడు. యేకాంతమైన ప్రదేశములో కూర్చొని తన ఇష్టదైవమైన రాములయొక్క దివ్యసౌందర్యమును, ఆశయాలను తన మనస్సులో చిత్రించుకుంటూ ప్రారంభించాడు.

యీ ప్రదేశములో వుంటే జనసమూహము అధికముగా వుంటున్నాది, కనుక, రామకథను రచించే నిమిత్తము తనకు యేకాంతవాసము కావాలనుకున్నాడు. అక్కడనుండి చిత్రకూట పర్వతమునకు ప్రయాణమైవెళ్లాడు. ఈ చిత్రకూటమనేది ఉత్తర ప్రదేశమునకు, మధ్య ప్రదేశమునకు మధ్యన వుంటున్నది. అర్ధము ఉత్తర ప్రదేశములో వుంది. అర్ధము మధ్య ప్రదేశములో వుంటున్నాది. ఇది బందా అనే జిల్లాలో చేరినది. యిక్కడ ప్రవేశించాడు, నిత్యము రామకథా రచన కొనసాగించాడు. ఆ సందర్భంలో తన గురువైన నరహరిదాసు బోధించిన రామాయణమునందుండే విషయాలంతా తన హృదయములో చిత్రింప చేసుకొని వాటినే స్మరించుకుంటూ, దానిని ఆధారము చేసుకొని కొన్ని కొన్ని పద్యాలు రాస్తూవచ్చాడు.

**మంచిగాని, చెడ్డగాని సహవాసముచేత ఒకరినుండి మరొకరికి వ్యాపిస్తుంది**

ఆ సమయములో ఒకనాడు రామపూజ నిమిత్తమై గంధముతీస్తూ రామచింతనచేస్తూ వుండినాడు, చిత్రకూట పర్వతముమీద తులసిదాసు. ఇద్దరు చిన్న పిల్లలు అక్కడ ప్రవేశించి 'తాతయ్య! తాతయ్య! మాకు యీ గంధము యిస్తావా' అన్నారు. ఈ తులసిదాసుకు చాలా మడి, ఆచారము, నియమ నిష్టలతో శ్రీరాముని పూజ చేసేవాడు. పూజా సమయములో ఎవరు అతనిని touch చేయకూడదు. "తాను పరిశుద్ధముగా వుంటుండాలి. భావాలుకూడ పరిశుద్ధమైనవి రావాలి" అని భావించేవాడు. కారణమేమిటంటే, ఒకరినొకరు touch చేసుకోవటంవల్ల వారి మాలిన్యము వీరికి, వీరి మాలిన్యము వారికి చేరడానికి



sri sathyasai vahini amrutam

అవకాశమున్నది. దేహసంబంధమైన మాలిన్యములేకాదు, భావసంబంధమైన మాలిన్యములుకూడను చేరటానికి అవకాశము వుంటుండాది. నిజానికి, పవిత్రమైన మహనీయులను, పవిత్రమైన గురువులను, పవిత్రమైన వ్యక్తులను తాకటముకోసమే నమస్కారములని ప్రారంభించారు. అంతేకాక, అపవిత్రమైనవారును, అసభ్యప్రవర్తనగలవారును, శీలరహితమైనవారును మనలను తాకినప్పుడు వారియొక్క దుష్టభావములు మనపై ప్రసరిస్తాయని ఆనాటి విశ్వాసము. మనిషిలో ఒకవిధమైన కరెంటు వుంటున్నాది. ఏవిధముగా మన యిండ్లకు కరెంటు వేసినప్పుడు shock కొట్టకుండా earth అని ఒక వైరు క్రిందికి వేస్తుంటామో, అదే విధముగా మన దేహములో కరెంటు వుండటంచేత భూమినుంచి shock వస్తుందేమోనని ఒక wooden పీట వేసుకొని దానిపైన ఒక వస్త్రమువేసుకొని ఆపైన ఒక లేడిచర్మము వేసుకొని ధ్యానము చేసేందుకు కూర్చోవటానికి మూలకారణము అది. ఈ కరెంటు సంగతి అందరికి అర్థముకాదు. ఆధ్యాత్మిక మార్గములో ప్రయాణము చేసే వ్యక్తులకు యిది చక్కగా అర్థమౌతుంది. ఈ కరెంటులో ఒక విధమైన గుణము వుంటున్నాది. అది మీకందరికి తెలుసు. ఒక వైరు ఎవరన్నా పట్టుకుంటే అతన్నింక లక్షమంది పట్టుకొనినా లక్షమందికి shock కొట్టేస్తుంది. అదేవిధముగా మంచిగాని చెడ్డగాని ఒకరినొకరు చేరటంచేత అవి యిద్దరిలోను ప్రవేశిస్తూవుంటాయి. ధ్యాన సమయములోపల ఒకరితో ఒకరు సంబంధములేకుండా, ఒకరినొకరు తాకకుండా కూర్చోటానికి ప్రయత్నంచేస్తూ వుంటారు. ఒకరినొకరు ఆనుకొని కూర్చున్న వారికి meditation లో యీ జన్మమునకు కాదుకదా, నూరు జన్మములకుకూడా concentration కుదరదు. ఇది శాస్త్రసమ్మతము, అనుభవపూర్వక లక్షణము. కాని, యీనాటి పిల్లలు దానిని విశ్వసించరు. కనుకనే ఎంతకాలము ధ్యానము చేసినప్పటికిని, వీరి పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుంటుది. తులసీదాసు తన ఆరాధనయొక్క లక్ష్యమును మనసునందుంచుకొని పిల్లలు యీ గంధమును తాకుతారోయేమో, తనను తాకుతారోయేమోనని వాళ్లని గమనించకుండా తనమాటుకు తాను రామనామమును గానముసు చేస్తూ గంధమును తీస్తున్నాడు. ఇంతలోనే ఆ చెట్టుపైనున్న ఒక పక్షి 'అయ్యా! తులసిదాసు! యీ వచ్చిన పిల్లలు రామలక్ష్మణులు, జాగ్రత్తగా మాట్లాడు' అందట. ఇది

sri sathyasai vahamrutam

మొట్టమొదటి అనుభవము, తులసీదాసుకు. ఆ విధముగా పలికిన చిలుకయే హనుమంతుడు. అయితే తులసిదాసుయందు ఇంకను కొంత మాలిన్యము వుండటంచేత, గడచిపోయిన సంసారజీవితముయొక్క మాలిన్యము యింకా అప్పుడప్పుడు హృదయములో మెదలుతుండటంచేతను అతనికి హనుమంతునివలే సాక్షాత్ రామలక్ష్మణుల దర్శనము కలుగలేదు. పరిశుద్ధమైన అద్దములోపల పరిశుద్ధమైన ప్రతిబింబమే వుంటుంది. మలినమైన అద్దములో మలినమైన ప్రతిబింబమే కనిపిస్తుంది. తులసీదాసు పరమభక్తుడైనప్పటికిని గడచిపోయిన జీవితముయొక్క మాలిన్యము అతని మనస్సులో అప్పుడప్పుడు మెదలుతుండడంచేత అతనికి రామలక్ష్మణుల అపరోక్షదర్శనము అనగా కొంతవరకు మార్పుగా కనుపించింది. ఇంతలోనే అతనిలో 'యీ చిన్నపిల్లలు రామలక్ష్మణులా', అనే సందేహము కలిగింది. తక్షణమే బాలురరూపములో వచ్చిన రామలక్ష్మణులు యిరువురు గంధము తీసి తులసిదాసు నొసటరాసారు. అంతర్థానమైపోయారు. దీని అంతరార్థమేమనగా 'అయ్యా! నీ మనసులో యింతకుపూర్వము చేసిన చెడ్డ పనులయొక్క దుర్గంధమంతా వుంటుండాది. ఇదుగో, ఇప్పుడు మేము యీ సుగంధమును నీ శరీరమునకు రాస్తున్నాము. ఇక నేటినుండి నీ భావములంతా సుగంధముగా మారిపోవుగాక!' అని.

### దర్శనం పాపనాశనం, సంభాషణం సంకటనాశనం, స్పర్శనం కర్మవిమోచనం

ఇంక ప్రారంభించాడు, తులసీదాసు కవిత్వము. ఏదిచెప్పిన, అన్నీకూడను లఘుగణములలోపలకూడి వచ్చే పదములే! ఏ ఒక్క పదముకూడను రామునకు విరుద్ధముగా రాలేదు. ఇది దైవానుగ్రహము. దైవస్పర్శయొక్క ప్రభావము. దైవదర్శనముయొక్క ప్రతిబింబము. అందుకోసమనే "దర్శనం పాపనాశనం, సంభాషణం సంకటనాశనం, స్పర్శనం కర్మవిమోచనం", అన్నారు. ఈ మూడుకూడను అయిపోయినాయి, తులసిదాసుకు. ఇతను యించుమించు త్యాగరాజు మార్గమునే అనుసరిస్తూవచ్చాడు. ఆ రామలక్ష్మణుల దివ్యదర్శనమును తనహృదయములో చిత్రించుకున్నాడు. మొట్టమొదట మనసునకు బోధచేయటానికి ప్రారంభించాడు.

sri sathyasai vahamrutam

"శ్రీరామచంద్ర కృపాళో భజమన-చరణ భవభయదారుణం". "ఈ భయంకరమైన సంసారమునుండి తరింపచేయుటకు కరుణాస్వరూపుడైన ఆ రామచంద్రుని చరణకమలములను స్మరింపవే మనసా!" అని తన మనసునకు మొట్టమొదట బోధ ప్రారంభించాడు. ఆ రామచంద్రునియొక్క స్వరూపాన్ని తల్లికిని, తండ్రికిని పోల్చుకుని చింతిస్తూవచ్చాడు. అదే విధముగా త్యాగరాజుకూడను

**శ్రీరామ జయరామ శృంగారరామ యని చింతించరాదే**
**ఓ మనసా చింతించరాదే!**
**తళుకు చెక్కుల మోము ముద్దిడను కౌసల్య తపమేమి**
**చేసెనో ఆ కౌసల్య తపమేమి చేసెనో!**
**శ్రీరామ రామ రారాయని దశరథుడు శ్రీరామ రారాయని**
**పిలువను తపమేమి చేసెనో!**

అని గానం చేశాడు. వారు ఎంత అదృష్టవంతులో, వారు యే తపము చేసిరో అని వారి తపస్సులనే చింతించుకుంటూ తానుకూడను ఆ తపస్సులోనే లీనమయ్యాడు'!

ఒకనాడు తులసిదాసు "రామచంద్రా! నేను దీనుడను, హీనుడను, క్షీణించిపోయే శరీరము కలవాడను. నాకు సర్వాంగములు వుండికూడను ఏమి ప్రయోజనము? నీ సేవకు కొరగాని హస్తములు వుండికూడను లేనటువంటివే! కన్నులు వుంటున్నాయి, పత్తికాయలవలే వుంటున్నాయి. అయితే అవి ప్రపంచాన్ని చూస్తున్నాయి కాని నిన్ను చూడలేకపోతున్నాయి. కనుక, నా కన్నులు వుండికూడను నేను గ్రుడ్డివాడనే! చెవులు వుంటున్నాయి, రామచంద్రా! కొండ గుహలవలే వుంటున్నాయి. ఈ caves లోపల కుక్కలు, నక్కలు చేరేవేగాని పవిత్రమైనవి యిందులో యేమాత్రము చేరవు. నాకు నాలుక వుంటున్నది కప్పవలె! ఎప్పుడు చూచినా కప్పనాలుక ఆడిస్తూ వుంటున్నాది. దేనికోసం? అది దాని స్వభావము. అంతే కాని, నీ నామము నాలుకపైన నాట్యమాడించటం లేదుకదా! అలాంటి నాలుకవుండి ఏమి ప్రయోజనము? ఈ విధముగా నాకు సర్వాంగములు వుంటున్నాయి కానీ, నీ సేవలో పాల్గొనటంలేదు. కనుక, 'నేను అంగవిహీనుడనే!' అన్నాడు.

srisathyasaivachanamrutam

అదే విధముగా త్యాగరాజుకూడ చెప్పాడు, 'కన్నులేలా? రాముని చూడని కన్నులేలా?' అని.

**హృదయానందమును అనుభవించిన వ్యక్తి వేరు సుఖమును కోరదు**

ఈ స్థాయిలోనే తులసిదాసు, త్యాగరాజు యిరువురు ఒకే మార్గాన్ని అనుసరిస్తూ వచ్చారు. ఇందులో తులసిదాసు మరింత ముందంజ వేస్తూవచ్చాడు. నిజముగా తనలో వుండిన దోషములనుగాని, తనలోవున్న బలహీనతలుగాని ఎవ్వరూ చెప్పుకోటం సాధారణముగా వుండదు. కాని, తులసిదాసు తనలో వున్న బలహీనతలుకూడను భగవంతుని దగ్గర మొరపెట్టుకున్నాడు. నేను యిలాంటి పాపములు చేశాను. తెలిసికూడను నేను అనేకవిధములైన దుర్మార్గములో పాల్గొన్నాను. ప్రతీ జీవునియందును నీవున్నావని తెలిసికూడను, యితరులను నేను సంబంధ బాంధవ్యముగా అనుభవించాను. కనుక, యీపాపములన్నిటిని నీవు క్షమించి నన్ను సరైన రీతిలో పరిశుద్ధుని గావించి నీలో చేర్చుకోమని ప్రార్థించాడు.

ఇంతేకాక, "రామచంద్రా! నీ విషయమును గుర్తించిన తర్వాత నాకీ ప్రపంచము అక్కరలేదు. మందారపుష్పమునందున్న మకరందమును గ్రోలే తుమ్మెద ఉమ్మెత్త పూలపై వ్రాలుతుందా! ఆకాశగంగలో సంచరించే రాజహంసలు మురికి కాలువలపైకి పోవునా! మామిడిచిగుళ్లను భుజించి కమ్మని గానముచేసే కోయిలలు అడవి మల్లెలపైన ఆశపడునా? ముద్దఖర్జూరమును తినే వ్యక్తి చింతపండుపైన ఆశపడునా? నిజముగా నీయొక్క ఆనందమును, నీయొక్క ప్రేమతత్త్వమును, హృదయానందమును అనుభవించిన వ్యక్తి మరొక దానిని యేమైనా ఆశించునా? నేను నీ ఆనందమును పూర్తిగా అనుభవించాను. నీ ప్రేమ రసామృతమును చక్కగా గ్రోలినాను. నీ మకరందములో నేను లీనమైనాను. ఈ ప్రపంచ దుర్గంధము నాకింక అక్కరలేదు". ఈ రీతిగా తనలో వున్న ఆవేదననంతాకూడను రామునిముందు వెళ్లబోసుకున్నాడు, తులసీదాసు.

**భగవంతుని సన్నిధికి మించిన పెన్నిధి జగత్తులో కనిపించదు**

దీనినే త్యాగరాజు మరొక రూపములో చెప్పూవచ్చాడు. ఆయనయొక్క భావముకూడను యీ రీతిగనే ప్రపంచమును త్యజించి, పరమాత్ముని వరించి తాను తరించే ధోరణిలో

సాగింది. “నేను పరులను చూచి కొంతవరకు అసూయలో మునిగాను. ఇతరులయొక్క కలిమిని చూచి నేను కుమిలిపోయాను. ఇవన్నీకూడను దుర్గుణములని నాకు తెలియకపోలేదు. ఈ భావములను నీవు నిర్మూలముచేసి, నా హృదయాన్ని పరిశుద్ధముచేసి చక్కగా యిందులో ప్రవేశించు రామా!”, అని ప్రార్థిస్తూవచ్చాడు. సాధకులందరూకూడను తమ చిత్తశుద్ధి నిమిత్తమై సాధనలు గావించుకుంటూ వచ్చారు. శోధన సల్పుతూ వచ్చారు. “నేనింక ఒక్కక్షణమైనా నిన్ను వదలి వుండలేను. కనుక, నన్ను నీలో ఐక్యం గావించుకోమ”ని ప్రార్థించుకున్నాడు, త్యాగరాజు.

**నినువినా నామదెందు నిలువదు శ్రీహరీ**
**కనులకు నీసొగసెంతో కలిగియున్నది ॥నిను వినా॥**

నిన్ను చూచిన కన్నులు మరియొక పదార్థమును చూడలేవు. నీ ఆనందమును అనుభవించిన జీవితము మరొక రకమైన ఆనందము నేమాత్రముకూడను ఆశించదు. ఈ విధమైన భావములు తులసిదాసు హృదయమునందు పెట్టుకొని “రామా! నేను అనర్హుడను. కాని, ఒక్కదాని యందుమాత్రము నేను అర్హుడను”, అన్నాడు. “నీ దాసురాలైన తులసికి నే దాసుడను. కనుకనే, నాకు ‘తులసిదాసు’ పేరు వచ్చింది. ఈ ఒక్క దానియందు మాత్రం నేను అర్హుడను. ఎందుకంటే తులసి సేవ హృదయపూర్వకముగా చేశాను. నీకు నన్ను దాసుడుగా స్వీకరించటం యిష్టంలేకపోతే దాసానుదాసుడుగానైనా స్వీకరించు”, అన్నాడు.

**దాసాను దాసుడను కావలెనురా**
**నీ దాసులకు సేవనే చేయవలెరా**

ఇలా తులసిదాసుయొక్క విషయములు చెప్పాలనుకుంటే కొన్ని సంవత్సరములు పడుతుంది. ఎంతచెప్పినాకూడను తరిగేదికాదిది. ఒరిగేదికాదిది. బయటనుంచి కూరేదికాదిది. హృదయమునుంచి ఊరేది. భగవంతుడు సకల సౌందర్యవంతుడనియు, అతనికంటే అందమైన వస్తువు యీ జగత్తులో లేదనియు, అతని సన్నిధికంటే మరొక పెన్నిధి యింక యీ జగత్తులో కన్పించదనియు, అతనిప్రేమకంటే మించిన ప్రేమ యింక యీ జగత్తులో కానరాదనియు, ప్రపంచసంబంధమైన వాంఛలన్నియు

sri sathyasai vachanamrutam

క్షణభంగురమనియు యీ ఐదారు వాక్యములను తన హృదయమునందు భద్రముచేసుకొని దానిపైన యీ తులసిదాసు రామాయణమును రచనచేస్తూ వచ్చాడు. కనుకనే తులసీదాసు రామాయణములో పరమ భక్తిప్రపత్తులతోకూడిన గంభీరత కనిపిస్తుంది.

**మాటయే మనిషికి ప్రాణము**

"రామచంద్రా! నీయొక్క ఘనత యెవరుకూడ వర్ణించలేరు", అన్నాడు. "ఎవరైనా వర్ణించడానికి ప్రయత్నిస్తే వారికి నీ ఘనత తెలియదు", అన్నాడు. నీళ్లలో పూర్తిగా మునిగినవ్యక్తి యే విధముగా మాట్లాడలేడో ఆవిధముగా నీయొక్క మకరందాన్ని గ్రోలినవారు దాని మాధుర్యము యిట్టిది, అట్టిది అని వర్ణించలేరు. ఒకవేళ ఎవరైనా వర్ణించ ప్రయత్నిస్తే వారు యీ నీటిలో మునుగలేదని అర్థము. కనుక, ఆనాటినుండి అతను ఒక్క మాటను నిలబెట్టుకున్నాడు. మాటయే మనిషికి ప్రాణము. ఈ మాటయే ఉన్నతస్థితికీ కొనిపోతుంది, అధోగతికీ దిగజారుస్తుంది. మాటయే మనిషికి స్నేహం కల్గింపజేస్తుంది, ద్వేషాన్నికూడను కల్గిస్తుంది. అయితే, ఒక్కొక్కప్పుడు మనసునందున్న సంస్కారాన్నికూడను ఆధారము చేసుకుని ప్రవర్తిస్తుంది. తులసీదాసు తన భార్య యిచ్చిన ఆదేశమువల్లనే రాముని పదసన్నిధికి చేరుకోగల్గాడు. ఈ విధముగా మాట ఒక చెడ్డ, మరొక మంచినికూడను చేకూరుస్తుంది. మంచికూడను రెండు చెడ్డలలోపలనే యిమిడివుంటుంది. కనుకనే, pleasure is an interval between two pains అన్నారు. 'నిజముగా నా భార్య నన్ను నిందించెనే', అనే అభిమాన మమకారములతో వుంటే నాకీ పవిత్రమైన సన్నిధి చిక్కివుండేదికాదు', అనుకున్నాడు తులసీదాసు. ఈ మమకార, అహంకారములే మానవుని ముంచి వేస్తుంటాయి. మమత్వమనేది శరీరముపైన వుంటున్నాది. అహంతత్వము ఆత్మకు సంబంధించినది. అలా కాకుండా వుండరానిదానిపైన మమత్వము, అహంతత్వాన్ని పెంచుకోటంచేతనే మానవుడు బంధితుడవుతున్నాడు. కనుక, "నన్ను యీ భవబంధములనుండి దాటించు, శ్రీరామచంద్ర కృపాళో!" అని రామచంద్రుని కృపాళునిగా పోల్చుకొని యీ భయంకరమైన భవబంధాన్ని దాటించమని కోరుకున్నాడు, తులసీదాసు.

**దైవముకంటే మించినవారు లేరు**

sri sathyasai vachanamrutam

తులసిదాసు ఏ క్షణమున తన గృహమును విడిచిపెట్టెనో ఆనాటినుండి తాను దేహమును చాలించేంతవరకుకూడను ఆ గృహమునుకాని, ఆ సంబంధమునుకాని మనసునందు ఒక్కక్షణమైనాకూడను చింతించలేదు. అదీ తీవ్రవైరాగ్యము. ఏదో యేకాంతముగా జీవించటంచేత మనము గొప్ప వైరాగ్యము కలిగినవారమనుకోవటం కేవలం ఒక బలహీనత. పవిత్రమైన వాతావరణమునందే, పవిత్రమైన భగవత్సన్నిధియందే అనుభవించలేని వైరాగ్యమును మూర్ఖుడు యింక యేకాంతములో ఎట్లు అనుభవించగలడు? ఇది అసాధ్యము. కనుక, యిలాంటి దివ్యసన్నిధియందే తాను వైరాగ్యమును అనుభవించాలని చిత్రకూటపర్వతాన్ని వదలిపెట్టి వచ్చాడు. "నేను తెలివితక్కువగా ఏకాంతవాసాన్ని చేయాలని భావించాను. ఎక్కడవుంది యీ జగత్తులో ఏకాంతము? ఎక్కడచూచినా నీవే వుంటున్నావు. నీవు లేని ఏకాంత ప్రదేశము ఎక్కడైనా ఉన్నదా? నీవున్నస్థానమే నాకు ప్రధానస్థానము", అని భావించి అయోధ్యను చేరుకున్నాడు. ఇక్కడ యింకొక విషయాన్ని మీరు చక్కగా గర్తించాలి. మీరాకూడను తులసిదాసుకు సమకాలీనురాలు అని కొందరు చెప్పవచ్చును. ఇది సత్యము. ఒకనాడు మీరాను అనేకమంది బాధిస్తూవచ్చారు. "నిరంతరము భగవచ్చింతన చేసుకుంటూ మానవత్వముయొక్క కర్తవ్యాన్ని నీవు పూర్తిగా వదలుకుంటున్నావు. ఇది సరైనదికాదు. నీ ధర్మాన్ని నీవు ఆచరించాల"ని, అనేకమంది మంచిగాను, చెడ్డగాను, కఠినముగాను ఆమెకు బోధిస్తూవచ్చారు. పెద్దలమాటలను పెడచెవిని పెట్టటము మూర్ఖత్వమనికూడను నిందించారు. తల్లితండ్రులే నీకు ప్రధానమైన ఆధర్మమూర్తులనికూడను బోధించారు. ఆమె సందిగ్ధావస్థలో మునిగిపోయింది. ఒకవైపు కృష్ణుడు, మరొకవైపున బంధువులు. బంధువుల నిమిత్తమై కృష్ణుని వదలుకొనటమా లేక కృష్ణుని నిమిత్తమై సర్వస్వాన్ని వదలుకోవటమా అనే సందేహము ఆమెను బాధిస్తూ వచ్చింది. మెల్లగా తులసిదాసు దగ్గరకు వచ్చింది. "మహానుభావా! నేను యిలాంటి పరిస్థితిలో వుంటున్నాను. నాకు చక్కని జ్ఞానోదయము కల్గించి, దేనిని వుంచమంటారు, దేనిని వదలమంటారు చెప్పండి," అని ప్రార్థించింది. కొన్ని నిముషములు ధ్యానములో నిమగ్నమైనాడు, తులసిదాసు. "రామా! దీనికి సరైన జవాబు నీవే నా ద్వారా అందించమ"ని కోరాడు. ఇదే పోతనచెప్పిన 'పలికెడిది భాగవతమట,

sri sathyasai vahini

పలికించెడివాడు రామభద్రుండట నే పలికిన భవహరమగునట' అన్న మాటలకు అర్థము.

తులసీదాసు మీరా ప్రశ్నకు జవాబు చక్కగా సూటిగా చెప్పాడు: "మీరా! ప్రాకృతికంగా తల్లితండ్రులు, గురువులు అత్యవసరము. లౌకిక జగత్తునందు తల్లితండ్రుల ఆజ్ఞను శిరసావహించవలసినదే! వారికి కృతజ్ఞతనందించవలసినదే! కాని, దైవమార్గమునకు అడ్డు తగిలితే తల్లియైనా, తండ్రియైనా, గురువైనాసరియే త్యజించవలసిందే! ఎందుకంటే తల్లి, తండ్రి, గురువుకంటేకూడను దైవము గొప్పవాడు. దైవమునకు మించినవారు మరొకరు లేరు. అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన నీటిబుడగకు వీరందరూ ఉదాహరణములు. పుట్టకమునుపు తల్లితండ్రులెవరు? చచ్చిన తరువాత తల్లితండ్రులెవరు? కాని, దైవము పూర్వము వున్నాడు, మధ్యలో వున్నాడు, తరువాతకూడా వుంటున్నాడు. అందువలన, ప్రాపంచిక సంబంధమైన విషయములలో తల్లితండ్రుల ఆజ్ఞను నీవు శిరసావహించి నడచుకో. నీకును, దైవానికి మధ్యవారు అడ్డవస్తే వారినికూడా త్యజించి, దైవాన్నే వరించు" అని సలహాయిచ్చాడు.

## దైవమార్గంలో ఎవరు అడ్డుతగిలినా లెక్కచేయనవసరంలేదు

ఇంకా, "ప్రహ్లాదునకు, నారాయణునకు మధ్య అడ్డుతగిలిన హిరణ్యకశిపుని ప్రహ్లాదుడు త్యజించలేదా? ఆ విధంగా త్యజించటంవల్ల నష్టమేమి వచ్చింది, ప్రహ్లాదునకు? రాములకు, తనకు మధ్యనున్న కైక తల్లియైనప్పటికి, అనేక విధములుగా బోధించినప్పటికి, భరతుడు తల్లి మాటను ధిక్కరించి రాములతో అరణ్యానికి చేరిపోయాడు. బలి చక్రవర్తి వామనునకు దానమిచ్చే సమయములోపల గురువైన శుక్రాచార్యుడు అడ్డు తగిలాడు. గురువైనను త్యజించి బలి చక్రవర్తి వామనునకు దానము చేశాడు సర్వమును. ఇట్టివారికి గొప్ప కీర్తియే లభించింది. యేవిధమైన అపకీర్తి, యేవిధమైన దుర్గతి వారందుకోలేదు. కనుక, దైవమార్గములో యెవరైనా సరే అడ్డుతగిలితే వారిని శతృవులుగా భావించమ"ని చెప్పాడు తులసిదాసు. దైవాన్ని పొందటానికి ఎవరు నీకు సహాయకారులౌతారో వారినే సద్గురువులుగా భావించమని చెప్పాడు. దీనికి తానే ఆదర్శమన్నాడు. "దైవాన్ని గురించి బోధించి, దైవసన్నిధికే నీవు పోమని, దైవాన్నే చింతించమని, తనపైవున్న యీపాదు

sri sathyasai vachanamrutam

వ్యామోహాన్ని దైవముపైననే వుంచుకుంటే కించిత్తైనా బాగుపడతావని బోధించింది, నా పత్ని. ఆమెయే నాకు సద్గురువు. ఇది నా అనుభవములో వుండిన ఆనందము. నిజముగా నా వ్యామోహమునకే ఆమె సహాయకారిగావుంటే నేనుకూడను నరకములో వుండేవాడను. ఈ భవ బంధములలో మునిగి అనేక విధములైన దుఃఖములను అనుభవించేవాడను", అని వివరించాడు. ఈ విధమైన బోధలనంతా తులసిదాసు అనేకంగా చేస్తూవచ్చాడు. అనేక మందికి సలహాలు యిస్తూవచ్చాడు.

తులసిదాసు రామాయణము మహాపవిత్రమైనది. వాల్మీకి రామాయణము, తులసి రామాయణం, కంబ రామాయణం, ఈ మూడింటియందుకూడా రామతత్త్వమును ఒకేవిధంగా వర్ణిస్తూవచ్చారు. వీరు ముగ్గురు మూడుకాలముల వారైనప్పటికి వారియొక్క రచన అంతా ఒకే విధముగా సాగింది. తులసిదాసు రామాయణము పూర్తిగా హృదయస్థానమునుండి యేర్పడినది. మధ్యమధ్య తనకు ఏవైనా సందేహాలు కలిగినప్పుడు హనుమంతుని ప్రార్థించి, అతనిద్వారా రామునియొక్క రహస్యాన్ని తాను తెలుసుకోవటానికి ప్రయత్నించేవాడు, తులసీదాసు.

**'అహం దేహోస్మి' భావనతో ప్రారంభమైన సాధన 'అహం జీవాస్మి' భావనలో ప్రవేశించి, 'అహం బ్రహ్మోస్మి' అనే గమ్యమును చేరాలి**

ఒకనాడు ఏదో తీవ్ర సమస్య ఏర్పడింది. రాముని ఎన్ని విధములుగా ప్రార్థించినప్పటికి యీ సమస్యకు సరైన సమాధానము రాలేదు. పూజారి తలుపు తెరిస్తేకాని దేవునియొక్క దర్శనము మనకు లభించదని చెవుతుంటారు. అదే విధముగనే శ్రీరాముని బంటుయైన హనుమంతుని ఆశ్రయిస్తేగాని రాములయొక్క రహస్యము మనకర్థము కాదని గుర్తించుకున్నాడు, తులసీదాసు. అప్పుడు హనుమంతుడు "నీ గొడవంతాకూడను నా దగ్గర చెప్పుకోటానికి వీలుకాదు. సీతమ్మతల్లి నిరంతరము రాముని యింటనే, వెంటనే, జంటనే వుంటుంటాది కనుక ఆమెను ప్రార్థించమ"ని చెప్పాడు. అదేరీతిగా రామదాసుకూడను "నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి నను బ్రోవమని చెప్పవే! అమ్మా నీవు సర్వకాల సర్వావస్థలలోను శ్రీరామునివెంట వుంటుంటావు. అతను చక్కగా ఆనందముగా వుండే

sri sathyasai vachanamrutam

సమయాన్ని చూచి, నీతో చక్కగా మాట్లాడే సమయముచూచి, యే విధమైన విచారము, కోపము లేని సమయాన్ని చూచి నా మాట అతని చెవిలో వెయ్యి", అని చెప్పాడు. అదే విధముగనే యీ తులసిదాసుకూడను సీతమ్మను ప్రార్థించాడు: "అమ్మా! నేను ఆయనను సమీపించలేను. తమరే రామునకు సమీపము, ఎందుకనగా రాముడు చంద్రుడు, నీవు వెన్నెల. చంద్రుని వదలి వెన్నెల, వెన్నెల వదలి చంద్రుడు వుండటానికి వీలుకాదు. కనుక, నా విషయాన్ని ఒక్కతూరి అతని చెవిలో వేసి దీనికి సరైన జవాబు చెప్పమ"ని ప్రార్థించాడు. చంద్రునికిని, వెన్నెలకు వున్న సంబంధమే రామునికి, సీతకు మధ్యవున్నది. రాముడు చంద్రుడు, సీత చల్లని వెన్నెల. రాములు అరణ్యమునకు వెళ్లే సమయములోపల ఆ కారడవులలో నీవు యీ బాధలు నీవు సహించలేవని అనేకమంది సీతకు బోధించినప్పటికిని, ఈమె, "అమ్మా! చంద్రుడు ఒక చోట, వెన్నెల ఒక చోట వుండటానికి సాధ్యమవుతుందా, లేదు. చంద్రుని దగ్గరనే వెన్నెల వుంటుండాది. కనుక, నేను రామచంద్రునితోనే వెళ్లుతాను", అని చెప్పింది. "ఎక్కడరాముడో, అక్కడే అయోధ్య. కనుక, నేను అయోధ్యవాసమునే అనుభవిస్తాను", అంది. ఆనాటినుండి యీ ఆడవారి రికమెండేషన్లు ఉంటూ వచ్చాయి. అయితే, కేవలం పవిత్రమైన మార్గమునకు, పరతత్త్వమును చూపించే మార్గమునకు వీరు ఆ రికమెండేషన్ చేస్తూవచ్చారు. కాని, యీనాటి పరిస్థితి యేమంటే తమ ప్రమోషనులు, జీతాలు పెంచటానికి రికమెండేషనులకొరకు అధికారుల భార్యల దగ్గరికి పోతున్నారు, ఈనాటివారు. ఇది సరైనదికాదు. తులసిదాసు ప్రత్యేకముగా బోధించిన విషయములోపల మూడింటిని యేకత్వముగా భావిస్తూ వచ్చాడు. అహం దేహాస్మి అనే సామాన్య మానవునితో ప్రారంభమై, అహం జీవాస్మి అనే మధ్యమార్గములో నిలచి, అహంబ్రహ్మాస్మి అనే గమ్యమును చేరమన్నాడు. అదికూడను పరమ గమ్యముకాదు. ఎందుకనగా అక్కడకూడను ద్వైతముంటున్నాది. అహం బ్రహ్మాస్మి. అహం, బ్రహ్మ అనే రెండు తత్త్వములు వుంటున్నాయి అక్కడ. కనుక, నేను, నేను అనే తత్త్వమే ఆత్మారామతత్త్వము అన్నాడు. దీనినే "రమయతీతిరామః, రమింపచేసేదే రామచంద్రునియొక్క స్వరూపము" అన్నాడు. కనుక, తులసిదాసు తత్త్వము యే సంసారముతో ప్రారంభమైందో ఆ సంసారములో వుంటూనే మోక్షసాధనచేసే మార్గాన్ని

srisathyasaivachanamrutam

నిరూపింపచేశాడు.

**నిజమైన చైతన్యము ఆత్మతత్త్వమే! దానిని దర్శించాలి**

తులసిదాసు దైవత్వమునకు భిన్నముగా మనము జీవించరాదని బోధించాడు. నీ స్వశక్తిపైన నీవు ఆధారపడటం మూర్ఖత్వము అన్నాడు. నీకట్టి అధికారములేదు, అన్నాడు. "నీవు కేవలము వట్టి జడమే! నిజమైన చైతన్యము నీయందున్న ఆత్మతత్త్వమే. అట్టి చైతన్యమును దర్శించమ"న్నాడు. తులసిదాసుయొక్క విషయములు కావలసినంత వుంటున్నాయి. అయినప్పటికి అవసరమైన విషయాలను మాత్రమే మనము స్వీకరించి దివ్యమైన మార్గమును అవలంబించి, పురుషత్వమును ప్రకటించి, దివ్యత్వమును వికసింపజేసి దైవత్వమును అనుభవించాలి అనే సత్యాన్ని గుర్తించి వర్తించటము అత్యవసరమని మీకు తెలియజేస్తూ నా దీర్ఘప్రసంగాన్ని విరమిస్తున్నాను.

ముఖ్యముగా దీనిలో వున్న "మాటకు తగినట్టుగా మనము ప్రవర్తించినప్పుడే మానవులమౌతాము. మాట భిన్నము, మన ప్రవర్తన వేరుగా వున్నప్పుడు మనము నిజముగా మానవులము కాము", అనే సత్యాన్ని మీరు గుర్తించి అనుభవించటానికి ప్రయత్నించండి. చెప్పినవన్నీ ఆచరించటానికి సాధ్యముకాదు. అదినిజమే! కాని, యే ఒకటిరెండైననూ జీవితములో ఆచరణలో పెట్టినప్పుడు మన జన్మ సార్థకమవుతుంది. ఈ కారణముచేతనే మొట్టమొదట నేను మాట్లాడనని కచ్చితంగా చెప్పాను.. మీరు మాటలను వృథా చేసుకోవచ్చునుగాని నా మాటలు విలువైనవి. కనుక, నా మాటలను వృథాచేసుకొనటం నాకిష్టంలేదు. కాలమును వ్యర్థము చేయటము యెవ్వరికి మంచిదికాదు. సరైన ఋతువును బట్టి, సరైన భూమిలో సరైన సమయములో విత్తనములు జల్లి సరైన ఫలితమును పొందాలి. హృదయక్షేత్రము పరిశుద్ధముగా వుంటుండాలి. వాక్కుబలముకూడను పరిపుష్టిగా వుంటుండాలి. ఇచ్ఛాశక్తికూడను దీనికి తోడుగా వుంటుండాలి. ఈ మూడు లేని సమయములోపల యీయొక్క విషయాన్ని మీరు యేమాత్రము స్వీకరించలేరు. దీనినే వేదాంతపరిభాషయందు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అన్నారు. కనుక, మీరు మాటలను సక్రమముగా వుపయోగపెట్టుకొని, దానిని

sri sathyasaivachanamrutam

సద్వినియోగముచేసుకొని, దానిని సరైన రీతిగా అనుభవించినప్పుడు పవిత్రులౌతారు, ఉన్నతస్థాయిని అనుభవిస్తారు.

**శ్రీ సత్యసాయి విద్యా సంస్థలు వ్యాపార సంస్థలుగా ప్రారంభింపబడలేదు**

మరొకటి; యిక్కడ అందరూ విద్యార్థులే చేరినారు. కొందరు అధ్యాపకులుకూడ వుంటున్నారు. కనుక, మరొక విషయముకూడను నేను announce చేయాలనుకుంటున్నాను. మన విద్యాసంస్థలు యే ప్రయోజనం నిమిత్తమై ఏర్పడినవనేది విద్యార్థులు, అధ్యాపకులు గుర్తించాలి. వీటిని కేవలము ఒక వ్యాపారసంస్థలుగా మేము ప్రారంభించలేదు. ఇది ఒక వృత్తి క్రింద మేము యోచించలేదు. ప్రపంచముయొక్క భవిష్యత్తును ఆశించి, లోకకళ్యాణమును హృదయమునందుంచుకొని, ఏ కొద్దిమందైన ఆదర్శవంతమైన విద్యార్థులు తయారవుతారనే వుద్దేశ్యముతో యీ విద్యాసంస్థలు మేము ప్రారంభించాము. ప్రాచీనమైన భారతీయ సంస్కారము, సంస్కృతులను యీ విద్యార్థులు వ్యాపింపజేసి కొంతవరకును దేశమును సరైన మార్గములో తీర్చిదిద్దాలని మేము ఆశించాము. ఈనాడు భారతదేశములో విద్యాసంస్థలన్నీ అనేకరకములుగా యేదో ఒక విధమైన వృత్తులక్రింద భావించి అపమార్గములను పట్టిపోతున్నాయి. మీరు పేపర్లోచూస్తూ వుండవచ్చు. వచ్చే సంవత్సరమునుండి యీ విద్యాలయములందు వారి ట్యూషన్‌ఫీజు, యింకా అనేకరకములైన ఫీజులుంటున్నాయి యివన్నీ డబుల్ చేస్తూ వస్తూన్నారు. దీనిని ముందుగానే వారు సూచిస్తూ వస్తున్నారు. కాని, మన సంస్థయొక్క విషయము దీనికి విరుద్ధముగా వస్తుండాది.

**మానవుని మానవునిగా తీర్చి దిద్దేది విద్య**

మేము వచ్చే జూన్ నుండికూడను యే యే ఫీజులుంటున్నాయో medical fees, games fees, lab fees, library fees, tution fees యివన్నీ తీసేస్తున్నాము. అంతా free education. ఇదియేవిధంగా మాకు ఆధాయమును చేకూరుస్తుందో మీరే గుర్తించాలి. విద్య అనేది ధనముతోగాని మరే విధమైన మార్గములోగాని యిచ్చి పుచ్చుకొనే వ్యాపారముకాదు. "సా విద్యా యా విముక్తయే"! ఇది విద్యయొక్క సరైన అర్థము, పరమార్థము.



sri sathyasai vahini amrutam

విముక్తిగావించేది, విద్య. పవిత్రముగావించేది, విద్య. మానవుని మానవునిగా తీర్చిదిద్దేది విద్య. దివ్యజీవనముచే మానవత్వమును వికసింపచేసేది విద్య. తన స్వశక్తిపైన తాను నిలువగలిగేటట్లు చేసేది విద్య. పవిత్రమైన ఆదర్శమునకై రక్తమునైనను త్యాగము చేసే ఆదర్శమునందించేది విద్య. బలహీనభావములకంతాకూడను గ్లూకోజు విద్య. ఇంతియేకాదు. అధైర్యముతో, అశక్తితో కృంగిపోయేవానికి పవిత్రమైన బలాన్ని యిచ్చేది విద్య. దీనినే calcium అంటారు. భగ్ అనిపిస్తుంది ఒక్కసారి. అంతేగాని యేదో బలహీనతతో నిశ్శక్తుని గావించుకొటము, నా జీవితము యేమవుతుందో అనే చింతనతో మునిగిపోయేటట్లు చేసేదికాదు విద్య. చాలామంది విద్యనభ్యసించటము కేవలము ఉద్యోగాలకోసమని అనుకుంటున్నారు. చేతికి ఒక begging bowl యిచ్చేదికాదు, విద్య. ఈ విధమైన విద్యకు మనము ధనము యేమాత్రము వినియోగించరాదు అనే వుద్దేశ్యముతో fees లంతా మానివేస్తున్నాము. తద్వారా తల్లితండ్రులకు కొంత శ్రమను తగ్గించిన వారమౌతాము. ధనములేక విద్య నభ్యసించనటువంటివారు ఎంతమందో వున్నారు. అవకాశమునందిస్తే అటువంటివారు యిక్కడ చేరటానికి అవకాశము వుంటుంది. మన University లోపల ధనవంతులు, ధనహీనులు అనే భేదము లేదు. కొంతమంది చెప్పారు, ధనమిచ్చి చదువుకోగలిగిన వాళ్లకు కొంత ఫీజు పెట్టి, ధనహీనులైనవాళ్లకు free education యివ్వవచ్చుని. యీ భేదాభిప్రాయములు పెట్టినప్పుడు సంస్థ పూర్తిగా అడుగంటిపోతుంది. విద్యార్థుల మధ్య ఎటువంటి భేదము వుండకూడదు అనే వుద్దేశ్యముతోనే నేను ఈ విధంగా announce చేశాను. ఏ భేదము వుండకూడదు. అందరికి ఒకే భోజనము. అందరికి ఒకే education. అందరికి ఒకే శిక్షణ. అందరికి ఒకే భావము. సర్వమతసమ్మతమే సాయియొక్క అభిమతము. వాళ్లను ఒక ప్రశ్న అడిగాను. Who is the poorest man in this world అని, who is the richest man in the world అని. అనేకమంది అనేకరకములుగా చెప్పారు. నేను చెప్పాను; He who has much satisfaction is the richest man, He who has many desires is the poorest man.

**ఐకమత్యమే మనకు నిజమైన బలము**

మీరు అందరు ఐకమత్యముగా వుంటుండాలి. ఐకమత్యమే మనకు నిజమైన బలము. ఇందులోపల యే విధమైన తారతమ్యము లేకుండా, కేవలము విద్యయందు మాత్రమే మీ లక్ష్యము కాకుండా నైతికంగా, ధార్మికముగా, ఆధ్యాత్మికముగా మీ చిత్తములను వికసింపచేసుకోవాలి. అందరు త్యాగరాజులు కానక్కరలేదు. అందరు తులసిదాసులు కానక్కరలేదు. అందరు కబీరులు కానక్కరలేదు. ఏకొంతమందైనా వారి భావములను చిత్తములందుంచుకొని సమయస్ఫూర్తిగా దానిని వినియోగించుకొని సార్థకము కావటము స్వామియొక్క యిష్టము. మతభేదములు మీయొక్క హృదయమునుండి తీసివేయండి. అందరిది ఒకే మతము; అదే మానవమతము. మన అందరియొక్క గమ్యము ఒక్కటే, దైవము ఒక్కటే, యీ సత్యమును మీరు గుర్తించి వర్తించాలి. అందరు దైవముయొక్క బిడ్డలుగా మీరు భావించుకోవాలి. ఈ సమత్వాన్ని మనము మన Institute నుంచి ప్రారంభము చెయ్యాలి. కేవలము ప్రచారముకొరకు యిక్కడ వున్నప్పుడు యీ ఆదర్శమును అనుసరించటము, యీ వాతావరణమునుండి దూరమైన తక్షణమే విరుద్ధమైన మార్గమును అవలంబించటము యిదికేవలము దేశద్రోహమేకాకుండా ఆత్మద్రోహముగా, దైవద్రోహముగా రూపొందుతుంది. ఎక్కడకు పోయినా గాని, నీ వెంట వచ్చినట్టుగా ఎక్కడ వుండినాకూడను యీ discipline, యీ భావములు shadow మాదిరి మీ వెంటరావాలి. ఆ విధముగా చేయకుండా మీ యిష్టానుసారము వర్తించుకుంటే అది మీ ఖర్మ. దీనికి ఎవరేమి చేయగలరు. "బుద్ధిః కర్మానుసారిణీ". మీ కర్మలు మీరనుసరిస్తారు. కాని, సాధ్యమైనంతవరకుకూడను ఆ విధముగా పెడమార్గము పట్టకుండా చూడటానికి తగిన కృషిచేయాలి. You must do.

**(తేదీ 16-2-1986న ప్రశాంతినిలయము హాస్టలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam